## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థతో దేశంలో యువతకు అవకాశాలు పెరిగాయని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన ఖర్ తెలిపారు.
- ఉగ్రవాదంపై భారతదేశం కఠిన విధానాన్ని అనుసరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు.
- దేశీయ ఎగుమతులను మరింతగా పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలను తీసుకుంటోందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.
- ఇరాన్, ఇజ్రాయిల్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి.
- అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి సంబంధించి ఏఏఐబీ దర్యాప్తు చేస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థతో దేశంలో యువతకు అవకాశాలు పెరిగాయని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన ఖర్ తెలిపారు. బీహార్లోని ముజఫర్ పూర్ లో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గడచిన దశాబ్ద కాలంలో భారత్, ప్రపంచంలో 11వ ఆర్థిక వ్యవస్థ నుండి నాలుగవ స్థానానికి చేరుకుందని చెప్పారు. ఆర్థిక అభివృద్ధి గణనీయంగా ఈ మధ్య కాలంలో పెరిగిందనడానికి ఇదే నిదర్శనం అని ఆయన పేర్కొన్నారు. దీంతో అనేక అవకాశాలు యువతకు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. అదే విధంగా నూతన విద్యా విధానం ద్వారా కేంద్ర ప్రభుత్వం నూతన ఆలోచనా విధానాన్ని ప్రోత్సాహిస్తోందని ఉప రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదంపై భారతదేశం కఠిన విధానాన్ని అనుసరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ తో ఈ విషయాన్ని ప్రపంచానికి తెలియజేశామని గుర్తుచేశారు. దేశ ప్రయోజనాలకు అవసరమైన నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ, నారాయణ గురుల సంభాషణల శతాబ్ది ఉత్సవాలలో ప్రధానమంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మ నిర్బర్ భారత్ లో భాగంగా, రక్షణ రంగంలో దేశీయంగా తయారు చేసిన ఆయుధాలే మంచి పనితీరుని కనబరుస్తున్నాయని చెప్పారు. భారతదేశం తన రక్షణ అవసరాల కోసం విదేశాలపై ఆధారపడడం క్రమంగా తగ్గుతోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రాచ్యంలో తీవ్ర ఆందోళనలకు దారితీసిన 12 రోజుల యుద్ధానికి ఇజ్రాయిల్, ఇరాన్ దేశాలు ఈరోజు ముగింపు పలికాయి. ఇజ్రాయిల్‌తో యుద్ధంలో కాల్పుల విరమణ ప్రారంభమైందని ఇరాన్ అధికారిక మీడియా ప్రకటించింది. చివరి నిమిషం వరకు తమ దేశం కోసం పోరాడిన టెహ్రాన్ సాయుధ దళాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కాగా, ఇరాన్‌తో కాల్పుల విరమణ కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనకు ఇజ్రాయిల్ అంగీకరించిందని ఆ దేశ అధ్యక్షుడు నెతన్యాహూ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రంప్ సమన్వయంతో ఇరాన్‌తో ద్వైపాక్షిక కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ అంగీకరించిందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎయిర్ ఇండియా విమానాలను ఈరోజు నుంచి క్రమంగా పునరుద్ధరించడం జరుగుతోందని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా వందలాది విమానాలు ప్రభావితమయ్యాయి. ఖతార్, బహ్రెయిన్‌తో సహా అనేక గల్ఫ్ దేశాలు గగన తలాన్ని మూసివేశాయి. ఈ నేపథ్యంలో ఇరాన్-ఇజ్రాయెల్ దేశాలు కాల్పుల విరమణను ప్రకటించాయి. దీంతో మధ్య ప్రాచ్యంలో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటోంది. ఈ క్రమంలో ఎయిర్ ఇండియా విమానాలను తిరిగి ప్రారంభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆపరేషన్ సింధు లో భాగంగా ఇరాన్ నుంచి మరో 292 మంది భారతీయులతో కూడిన ప్రత్యేక విమానం ఈరోజు తెల్లవారుఝామున న్యూఢిల్లీకి చేరుకుంది. మరోవైపు ఇజ్రాయెల్ నుంచి బయలుదేరిన విమానం 161మంది భారతీయ ప్రయాణీకులతో న్యూఢిల్లీకి చేరుకున్నదని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఈ రెండు విమానాలలో వచ్చిన భారతీయులకు విదేశాంగ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా న్యూఢిల్లీ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. కాగా, ఇప్పటి వరకు ఇజ్రాయెల్ నుంచి ఆపరేషన్ సింధు పేరిట 604 మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి రప్పించామని రణధీర్ జైస్వాల్ తెలిపారు. అలాగే ఇరాన్ నుంచి ఇప్పటివరకు 2వేల 295 మంది భారతీయులు స్వదేశానికి వచ్చారని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ ఎగుమతులను మరింతగా పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలను తీసుకుంటోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఎక్సిమ్ బ్యాంక్ వాణిజ్య సదస్సు -2025 కు ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత దేశ ఎగుమతులు 825 బిలియన్ డాలర్లకు పెరిగాయని గుర్తు చేశారు. ఇది అత్యధిక పెరుగుదల శాతంగా ఆమె చెప్పారు. ఇదే సందర్భంలో ప్రపంచ ఎగుమతులు నాలుగు శాతం మాత్రమే ఉండగా దేశీయ ఎగుమతులు 6.3 శాతం వృద్ధిని సాధించాయని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సంవిధాన్ హత్య దివస్ ని రేపు జరుపుకుంటున్నారు. 1975 జూన్ 25న దేశంలో అత్యవసర పరిస్థితిని విధిస్తూ ఆనాటి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేదని ప్రజాస్వామ్య ప్రియులు పేర్కొంటారు. అలా ఆనాటి అత్యవసర పరిస్థితి వల్ల అనేక విధాలుగా బాధపడిన వారందరికీ నివాళి అర్పించే రోజుగా సంవిధాన్ హత్య దివస్ ని దేశంలో జరుపుకుంటున్నారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం 25 జూన్ ను సంవిధాన హత్య దివస్ గా ప్రకటించింది. అత్యవసర పరిస్థితుల సమయంలో అధికారం దుర్వినియోగంపై యుద్ధం చేసిన వారికి, అలాగే బాధపడిన ప్రతి ఒక్కరికి నివాళి అర్పించే రోజుగా గుర్తుంచుకుంటున్నారు. కాగా.. 1975 జూన్ 25న కేంద్ర ప్రభుత్వం దేశంలో 18 నెలలు అత్యవసర పరిస్థితిని విధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించిన బ్లాక్ బాక్స్‌ను విశ్లేషణ కోసం విదేశాలకు పంపారంటూ వస్తున్న వార్తలను పౌర విమానయాన శాఖా మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. బ్లాక్ బాక్స్ భారత్‌లోనే ఉందని, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దానిని

పరిశీలిస్తోందని ఆయన స్పష్టం చేశారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఫిక్కీ సంయుక్తంగా న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన హెలికాప్టర్లు, చిన్న విమానాల సదస్సుకు హాజరైన కేంద్ర మంత్రి ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడారు. బ్లాక్ బాక్స్ నుంచి సమాచారాన్ని వెలికితీయడానికి ఏఏఐబీ సరైన పద్ధతులను అనుసరిస్తోందని అన్నారు. ఏఏఐబీ దర్యాప్తు పూర్తిగా సాగాలని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ బైట్...28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత సాయుధ బలగాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం కోసం ఒక వెయ్యి 980 కోట్ల రూపాయల విలువైన అత్యవసర ఆయుధ, అనుబంధ పరికరాలు, యంత్రాల సేకరణ కోసం 13 ఒప్పందాలకు రక్షణశాఖ ఆమోదం తెలిపింది. ఆయుధాలు, మందుగుండు సామగ్రిని అత్యవసర సమయాల్లో నేరుగా కొనుగోలు చేసేలా రక్షణ దళాలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారం ఇచ్చిందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇంగ్లాండ్ లో లీడ్స్ వేదికగా భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా మారింది. రెండవ ఇన్నింగ్స్‌లో 371 పరుగుల లక్ష్య ఛేదనకు 5వ రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు ఇప్పటివరకు 2 వికెట్లు నష్టపోయి 240 పరుగులు చేసింది. ఇంగ్లండ్ విజయానికి ఇంకా 131 పరుగులు చేయాల్సివుండగా భారత్ విజయానికి 8 వికెట్లు తీయాల్సిఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =